క్లుప్తంగా

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం


యాదవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మడప యాదవరెడ్డిని కూచనపెల్లి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు మంద సత్యనారాయరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు సేవచేసే అవకాశం కల్పించినందఅన్నారు. గ్రామాభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిధులు తీసుకురావాలని కోరారు. రైతు సంక్షేమానికి ఉపయోగపడే పథకాలను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గాలిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం


సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరుకు చెందిన నిరుపేద రాళ్లబండి లింగం కూతురు వివాహం నిమిత్తం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ ఆదివారం ఆర్థిక సాయం అందించారు. అలాగే ఆ కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ పేదలకు సేవచేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురామ్, కనకరాజు, గణేశ్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ములుగు(గజ్వేల్): రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఆ శాఖ డైరెక్టర్ సాయిబాబా తెలిపారు. మండలంలోని క్షీరసాగర్ 33 కేవీ, తున్కిబొల్లారం 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని వినియోగదారులకు ఎలాంటి అవాంతారాలు లేకుండా విద్యుత్‌ను అందించాలని ఇప్పటికే అధికారులకు సూచించామని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ డీఈ భానుప్రకాశ్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు అభినందన

కొండపాక(గజ్వేల్): ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియామకమైన ప్రొఫెసర్ ఖాసింను ఆదివారం దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకి చంద్రభాను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రభాను మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌గా దళిత వర్గానికి కేటాయించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. యూనివర్సిటీ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపుతూ విద్యార్థులకు దిక్సూచిగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

దుబ్బాకటౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాయపోల్ గ్రామస్తుడు బ్యాగరి రమేశ్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. 2007– 2008లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.41 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు వెంకటేశ్, స్వామి, కరుణాకర్, ఆంజనేయులు, మధుసూదన్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రేపు అష్టావధానం

నారాయణఖేడ్: మండలంలోని చాప్టా(కె) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాహితీ కళాప్రవీణ స్వర్ణకంకణ సత్కార గ్రహీత పద్యశిల్పి యువ అవధానిచే అష్టావధానం నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు తెలిపారు. పద్యకవి సీహెచ్. భూమయ్య రచించిన శ్రీరామశతకం ఆవిష్కరణోత్సవం సైతం ఉంటుందన్నారు. అష్టావధానులు కసిరెడ్డి వెంకటరెడ్డి, కంది శంకరయ్య, చక్రవర్తి హాజరవుతున్నారని చెప్పారు.


పాత బస్టాండ్ వద్ద చెత్తాచెదారంతో నిండిపోయిన కల్వర్టు


శివాజీ చౌరస్తాలో దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువ

ముక్కు మూసుకోవాల్సిందే..

అధికారులు పట్టించుకోకపోవడంతో మిరుదొడ్డిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు కాలువల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. రోజుల తరబడి వాటిని తొలగించక పోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో గ్రామస్తులు మండిపడుతున్నారు. మురుగు కాలువల వల్ల దోమలు విజృంభించి రాత్రిపూట కంటికి కునుకు లేకుండా పోతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే

- పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన
- ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ మదన్‌మోహన్


తాను రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మదన్ మోహన్.


సదస్సులో మాట్లాడుతూ..

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు కేవలం విద్యార్థులకు విద్యను అందించడంతోనే సరిపెట్టుకోకూడదు. వారికి నిత్యం ఉత్సాహాన్ని అందిస్తూ నిత్యనూతన అంశాలను తెలుసు కోవాలనే ఆసక్తిని రేకెత్తించాలి. దాంతో పాటు వాటిని పరిశోధించి అవి సమాజానికి ఏవిధంగా ఉపయోగపడుతాయో చేసి చూపించేలా వారిని తయారు చేయాలి. అందుకు అధ్యాపకుడు సైతం నిత్యనూతన విద్యార్థిగా మారి పరిశోధలను చేస్తూ విద్యార్థులను పరిశోధనలవైపు ఆసక్తిని పెంపొందించుకునేలా చేయాలి. సరిగ్గా అదే కోవకు చెందుతారు సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ కళాశాలలో సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మదన్‌మోహన్. ఇటీవల ఆయన రాసిన పరిశోధనా పత్రం నేపాల్‌లో ఈ నెల 24, 25వ తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సుకు ఎంపికయింది. సిరిసిల్ల జిల్లా మల్కాపూర్ అనే చిన్న గ్రామంలో స్వరూప-సత్తయ్య దంపతులకు జన్మించిన ఆయన ప్రాథమిక విద్య అంతా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేశారు. అలాగే కరీంగనగర్ ప్రభుత్వ డిగ్రీ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ, జేఎన్‌టీయూలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. తాను చదివిన ఎస్ఆర్ఆర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుడిగా చేరి 16 ఏళ్లుగా డిగ్రీ విద్యార్థులకు, ఆరేళ్లుగా పీజీ విద్యార్థులకు సేవలను అందించారు. బదిలీల్లో భాగంగా కరీంనగర్ నుంచి సిద్దిపేట డిగ్రీ కళాశాలకు వచ్చిన ఆయన రెగ్యులర్ సహాయాచార్యుడిగా నియామకమయ్యారు. యంగ్ సైంటిస్ట్, లయన్స్‌క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయ, బెస్ట్ రీసెర్చ్ సూపర్‌వైజర్, బెస్ట్ రివైవర్ తదితర అవార్డులను అందుకున్నారు. మెథడాలజీ టెక్నిక్స్ తదితర అంశాలపై మూడు జాతీయ సదస్సులను నిర్వహించారు. వీటితో పాటు 10 అంతర్జాతీయ సదస్సులు, 30 జాతీయ సదస్సులకు హాజరై 24 పరిశోధనా పత్రాలు, 12 పుస్తకాలను ప్రచురించి సమర్పించారు. మంచినీళ్లలో బ్యాక్టీరియాలను కనుగొని పేటెంట్ హక్కులను సైతం సొంతం చేసుకున్నారు. చెరువులు, సాగు భూములు, పుష్కరఘాట్ల నీరు, పానీపూరి, మరుగుదొడ్లలో బ్యాక్టీరియా వ్యాప్తి, పరిణామాలపై పరిశోధనలు చేశారు. బయోమెట్రిక్, కరచాలనం, జ్యూస్‌లలో కలిపే ఐస్, వేడి పదార్థాల పార్సిల్స్, కండ్లకలక తదితరాల ద్వారా వ్యాప్తి చెందే వైరస్‌లపై విద్యార్థులతో కలిసి పలు పరిశోధనలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు.

ఆరోగ్యంగా ఉంటేనే సామాజికాభివృద్ధి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు నరేశ్‌బాబు

గజ్వేల్‌రూరల్: ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని సంగాపూర్ రోడ్డులోని సంతోషిమాత దేవాలయం సమీపంలో ఆదివారం ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. ప్రజలు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. తక్కువ ధరలకే నాణ్యమైన మందులను అందించాలనే ఉద్దేశ్యంతో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటయ్యాయని చెప్పారు. శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన ఔషధి కేంద్రం నిర్వాహకులు భావన, రమణాచారి, వినోద్, గోపాల్, వెంకటేశ్, విజయ్‌కుమార్, హరీశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తండ్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభాపతి శ్రీపాదరావు జయంతిని ఆదివారం హైదరాబాద్‌లోని శాసనసభ లాంజ్‌లో నిర్వహించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు

సంగారెడ్డి టౌన్: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలను సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రైతులతో సమావేశం ఉంటుందని, కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

పటాన్‌చెరు టౌన్: ప్రతీ ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని న్యాయవాది నాగరాజు యాదవ్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి పోచారంలోని హనుమాన్ దేవస్థానం వద్ద భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల్లో భక్తిభావంతో పాటు దేశభక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి అధ్యక్షుడు శేషాద్రి, బజరంగ్ దళ్ సభ్యులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కమిటీ ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాల జంగం మహేశ్వర సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఆదివారం సిద్దిపేటలో ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర రాజలింగం అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రుపల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా సదానందం, గురుమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా ఎన్నం రాజు, ప్రధాన కార్యదర్శిగా అల్లం పరమేశ్, కోశాధికారిగా లింగం, కార్యదర్శి, సహాయ కార్యదర్శులుగా రాజు, రాజేశ్వర్, శివకుమార్, దేవరాజు, పరమేశ్వర్ కార్యవర్గ సభ్యులుగా శంకర్, శివలింగం, సత్యం, ఈశ్వరయ్య, ప్రవీణ్, కాశిలింగం, సోమలింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న వివిధ కాలనీలవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు రోడ్డుకు ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ఆదివారం తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి చేరి, గుంతలు ఏర్పడినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీంతో స్వయంగా తామే శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతు పనులు చేశామని చెప్పారు. ఈ మార్గంలో ఉన్న ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని ప్రభుత్వం ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర నేత మల్లికార్జున్


సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తయారు చేసిన కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలపై 30 శాతం పన్నుల భారం వేసి నడ్డి విరుస్తుండగా, కార్పొరేట్ సంపన్నులపై 32 శాతంగా ఉండగా, కేంద్ర ప్రభుత్వం దానిని 22 శాతానికి కుదించిందని విమర్శించారు. ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసిందని, కార్మిక రంగానికి రూ.3,500 కోట్లు, ఉపాధి హామీ కార్మికులకు రూ.80 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని వాపోయారు. కార్పొరేట్ సంస్థలకు వేలకోట్ల రాయితీలు ఇచ్చారని మండిపడ్డారు. కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఈ ఉద్యమంలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆర్‌బీఎల్ యూనియన్-సీఐటీయూ ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, నాయకులు వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, స్వామి, శ్రీనివాస్, వెంకట్రావ్, రవికుమార్, నర్సింహులు, సాజిద్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత లచ్చపేట


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న డాక్టర్ అరవింద్ కుమార్ తదితరులు

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో తెలంగాణ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల సహకారంతో నిర్వహించిన లచ్చపేట ప్రీమియర్ లీగ్(ఎల్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఉత్కంఠగా సాగింది. దుబ్బాక మార్నింగ్ క్రికెట్ ఫ్రెండ్స్(ఎంసీఎఫ్), లచ్చపేట జట్లకు ఫైనల్ మ్యాచ్ జరగ్గా పది పరుగుల తేడాతో లచ్చపేట జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన లచ్చపేట జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 159 పరుగులు చేసింది. ఎంసీఎఫ్ టీం పది పరుగుల తేడాతో ఓటమి పాలైంది. నెల రోజులుగా సాగుతున్న ఈ టోర్నీలో దాదాపు 35 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు తెలంగాణ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల డాక్టర్ అరవింద్ కుమార్ రూ.12,100 నగదు బహుమతితోపాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.7,100 నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపనాల్ బుచ్చిబాబు, నాయకులు శ్రీకాంత్, సంతోష్, శ్రీనివాస్, సతీశ్‌గౌడ్, కిషన్, అరుణ్ తదితరులున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన


రోడ్లను పరిశీలిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూంల కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, నాయకులు బాలాగౌడ్, ఉల్లెంగెల నరేశ్, బైరి నర్సింహులు, డక్కలి శ్రీను, కొరిమి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దరువు అంజన్నకు పలువురి పరామర్శ


నివాళులర్పిస్తున్న ఉమర్ తదితరులు

దుబ్బాకటౌన్: ఓయూ జేఏసీ చైర్మన్, కవి, గాయకుడు దరువు అంజన్న మాతృమూర్తి లలితమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక సేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్ ఆదివారం ఆయనను పరామర్శించారు. అంజన్న తెలంగాణ ఉద్యమంలో తన ఆట పాటలతో క్రియాశీలకంగా పోరాటం చేశారని, తల్లి మరణంతో మనోధైర్యంగా కోల్పోకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ కోశాధికారి మహమ్మద్ ఉమర్, ఇంతియాజ్, రామస్వామి తదితరులున్నారు.

గుండె ఆపరేషన్ల రిజిస్ట్రేషన్లకు ఆహ్వానం



నూతనంగా నిర్మించిన చైల్డ్ హార్ట్ కేర్ ఆస్పత్రి

కొండపాక(గజ్వేల్): కొండపాకలో నూతనంగా స్థాపించిన సత్యసాయి సంజీవనీ సెంటర్ ఫర్ హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్లో చిన్న పిల్లలకు గుండె సంబంధిత చికిత్సల కోసం సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించినట్లు చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లవాడి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితంగా గుండె సంబంధిత ఆపరేషన్లు చేస్తారన్నారు. పేషేంట్‌ను వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉంచి పరిశీలిస్తారని, వారితో తల్లిదండ్రులు కూడా ఉండటానికి వసతి కల్పిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందినవారైనా సరే ఆపరేషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 98495 55560 నంబరును సంప్రదించవచ్చని చెప్పారు.

అపూర్వ సమ్మేళనం


లద్నూర్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూర్ పాఠశాలలో 2004–05లో పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 యేళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో కలుసుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం దొమ్మాట పాఠశాలలో 24యేళ్ల క్రితం చదువుకున్న(2001–02)టెన్త్ విద్యార్థులు సందడి చేశారు. ఆ నాటి స్మృతులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులు కృష్ణమచారి, గణపతి, రామకృష్ణ, రాజగోపాలచారి, రాంప్రభాకర్, ప్రవీణ్‌బాబు, గౌరీ మోహన్, జూహెద్ అలీని ఘనంగా సన్మానించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990